ఆంధ్రజ్యోతి

andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.9, కనిష్ఠం 13.5

నిజామాబాద్ జిల్లా వార్తలు

5 సోమవారం 17 నవంబరు 2025



- జిల్లాలో అవినీతికి అడ్డాలుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- అసైన్డ్ భూములనైనా రిజిస్ట్రేషన్ చేస్తున్న ఘనులు
- ఏసీబీ దాడులు జరుగుతున్నా.. మారని అధికారుల తీరు
- కోడ్ భాషలో అందినకాడికి దండుకుంటున్న సబ్ రిజిస్ట్రార్లు
- జిల్లావ్యాప్తంగా మొత్తం ఐదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

భూ.. మాయ!

నకిలీ పత్రాలతో యథేచ్ఛగా రిజిస్ట్రేషన్‌లు

సర్కారు భూములైనా.. ఆబాది భూములైనా.. నకిలీ పత్రాలను సృష్టించి జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో యథేచ్ఛగా రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్స్, మధ్యవర్తులతో కోడ్ భాషలో ఒప్పందాలు చేసుకుని.. అక్రమాలైనా సక్రమంగా రిజిస్ట్రేషన్‌లు చేస్తున్న ఘటనలు అనేకం ఉన్నాయి. రెండు రోజుల క్రితం నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ దాడులు కలకలం సృష్టించాయి. గత కొన్ని రోజులుగా నిజామాబాద్ అర్బన్‌తో పాటు నిజామాబాద్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 23 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.



నిజామాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



S.No	Village	Name	Survey No	Extent (Ac.Gts)	Nature of Land	Classi... of L...
221	Sarangapur	[illegible]	83/p1	0.1000	లావుణి పట్టా	మాగాణి
222	Sarangapur	[illegible]	83/p2	0.1000	లావుణి పట్టా	మాగాణి
223	Sarangapur	[illegible]	83/p3	0.1000	లావుణి పట్టా	మాగాణి
224	Sarangapur	[illegible]	83/p4	0.2000	లావుణి పట్టా	మాగాణి
225	Sarangapur	[illegible]	83/p5	1.0100	లావుణి పట్టా	మాగాణి

ధరణి పోర్టల్‌లో సర్వే నెంబరు 87/పి1 లావుని పట్టాగా ఉన్న భూములు

నిజామాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాకేంద్రంలోని రిజిస్ట్రార్ కార్యాలయంతో అనుబంధంగా ఉన్న నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై సైతం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి పలు డాక్యుమెంట్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తుంది. కార్యాయంతో పాటు సబ్ రిజిస్ట్రార్ ఇంటిపై కూడా ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఐదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిత్యం మధ్యవర్తులతో సందడిగా ఉంటున్నాయి. నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బోధన్, భీంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో నిత్యం వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పోలిస్తే నిజామాబాద్ అర్బన్, రూరల్ కార్యాలయాలు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. గత కొన్ని రోజులుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం లేక స్తబ్దుగా ఉన్నా.. రిజిస్ట్రేషన్‌లు ఇటీవల కాలంలో కొంత పెరగడం తో అదే అదునుగా మధ్యవర్తులు, సబ్ రిజిస్ట్రార్‌లు అందినకాడికి దండుకుంటున్నారు. ఒక్కో డాక్యుమెంట్‌కి ఒక్కో రేటు నిర్ణయించి ఆ రిజిస్ట్రేషన్‌లను మాత్రమే పూర్తి చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత కొన్ని నెలల క్రితం నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ రామరాజు అవినీతి నిరోధక శాఖ అధికారులకు లంచం తీసుకుంటూ పట్టుబడిన వ్యవహారం మరవకముందే.. మళ్లీ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ తనిఖీలు ఒక్కసారిగా డాక్యుమెంట్ రైటర్‌ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించాయి. నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నాన్ లేవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు, అనుమతిలేని వెంచర్‌ల ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు, డీటీపీసీ అనుమతులు లేని రిజిస్ట్రేషన్‌లు అధికంగా జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న క్రమంలో అవినీతి నిరోధకశాఖ తనిఖీలు అక్రమార్కులకు నిద్రలేని రాత్రులను కలిగిస్తున్నాయి.

బిజీబిజీగా పలు కార్యాలయాలు

నిజామాబాద్ అర్బన్, రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఎప్పుడూ బిజీగా ఉంటాయి. నిజామాబాద్ నగరం విస్తరించడం, బైపాస్ రోడ్, ఇతర ప్రాంతాలలో కొత్తకొత్త వెంచర్‌లు ఏర్పాటవుతుండడంతో రిజిస్ట్రేషన్ ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. ఇదే అదునుగా మధ్యవర్తులు, డాక్యుమెంట్ రైటర్‌లు రిజిస్ట్రేషన్‌లలో కొన్ని పత్రాలు లేకున్నా.. నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిజామాబాద్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2024లో అప్పటి సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉండగా.. జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ అధికారి సారంగపూర్ శివారులోని సర్వే నెం.83/పి1 కింద ఉన్న 10 గుంటల అసైన్డ్ భూమిని పవర్ ఆఫ్ అటార్నీ పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. ఈ వ్యవహారంలో ఫ్యామిలి మెంబర్ సర్టిఫికెట్‌తో పాటు నాళా సర్టిఫెట్ల ను ఫేక్‌గా రూపొందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ జూనియర్ అసిస్టెంట్ దర్పాగా దోమకొండలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ వ్యవహారంలో అప్పటి సబ్ రిజిస్ట్రార్, జూనియర్ అసిస్టెంట్‌లకు భారీ



(తరువాయి 8వ పేజీలో...)



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సాయిచైతన్య

అంతర్‌రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ దోపిడీ ముఠా అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సీపీ సాయిచైతన్య

సుభాష్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత యేడాది కాలంగా ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి కాపర్ కాయిల్స్ దొంగిలిస్తున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలోని ఇందల్‌వాయి, ధర్పల్లి, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, మెండోరా, మోపాల్, ముప్కాల్, బోధన్ టౌన్, బోధన్ రూరల్, నవీపేట, వర్ని మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్‌ను దొంగిలిస్తున్న ముఠాలోని ఐదుగురు సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఆదివారం పోలీసు కమిషనర్ సాయిచైతన్య విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. వారి నుంచి 40కిలోల కాపర్ కాయిల్స్‌తో పాటు రూ.5.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాను ఇందల్‌వాయి పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఇందులో మహారాష్ట్రలోని హైమద్‌నగర్‌కు చెందిన సుధాకర్, ఉత్తరప్రదేశ్‌లోని అమిన్‌నగర్‌కు చెందిన హర్బిర్‌శర్మ, గుంటూరుకు చెందిన అలిహైమద్, ప్రకాశం జిల్లాకు చెందిన వెంకటేశ్వర్లు, మహబూబ్‌నగర్‌కు చెందిన రవీందర్, కర్నాటకకు చెందిన లింగప్ప, సిద్దిపేటకు చెందిన శ్రీశైలం, ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ హైదర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఇందల్‌వాయి వద్ద వాహనాల తనిఖీలలో భాగంగా గన్నారం వద్ద అనుమానం వచ్చి నిందితులను పట్టుకుని విచారించగా ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయిల్స్ దొంగలిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని ఆయన తెలిపారు. నిందితులను కోర్టు ముందు హాజరుపర్చి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. ఈ ముఠాను పట్టుకోవడంలో ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి ముఖ్యపాత్ర పోషించగా.. డిచ్‌పల్లి సీఐ వినోద్, ఇందల్‌వాయ ఎస్‌ఐ సదీప్, డిచ్‌పల్లి ఎస్‌ఐ షరీఫ్, జక్రాన్‌పల్లి ఎస్‌ఐ మహేష్, సిబ్బంది కిరణ్‌గౌడ్, ప్రశాంత్, సందిప్, సుజిత్, నవీన్ సర్దార్, తదితరులను సీపీ ఈ సందర్భంగా అభినందించారు.

స్పెషల్ లోక్ అదాలత్‌లో 4,898 కేసుల పరిష్కారం

6

- సైబర్ బాధితులకు రూ. 20,96,406 అందజేత : సీపీ



డొంకేశ్వర్‌లో ఆలయంపై ఒరిగిపడిన మర్రి వృక్షం

నేలకొరిగిన 50 ఏళ్ల భారీ మర్రి వృక్షం

డొంకేశ్వర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న భారీ మర్రిచెట్టు మహాలక్ష్మి అమ్మవారి ఆలయంపై ఒరిగిపడింది. ఆదివారం ఉదయం గాలి లేదు.. వాన లేదు అకస్మాత్తుగా గ్రామస్థులు చూస్తుండగానే భారీవృక్షం నేలకొరగడంతో స్థానికులు అవాక్కయ్యారు. ఆ సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న వీడీసీ సభ్యులు మర్రి వృక్షానికి పూజ చేసి ఆలయం నుంచి తొలగించారు. భారీ వృక్షం పడటంతో మహాలక్ష్మి అమ్మవారి స్లాబ్ పైభాగం కొంచెం పగిలిపోయింది. ఆలయానికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఆ వృక్షానికి 50 ఏళ్ల చరిత్ర ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామం ఏర్పడక ముందు ఉన్న ఆ చెట్టు అకస్మాత్తుగా పడిపోవడంతో గ్రామంలో ఆ వృక్షం గురించి ప్రజలు చర్చించుకుంటున్నారు.

నేడు ఉమ్మడి జిల్లా రైఫిల్ షూటింగ్ ఎంపికలు

సుభాష్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల రైఫిల్ షూటింగ్ ఎంపికలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబరు సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరి నాగమణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్ ట్రస్ట్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమి బోధన్ రోడ్‌లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10గంటల వరకు హాజరుకావాలని వారు ఈ సందర్భంగా తెలిపారు.

కొనసాగుతున్న పట్టాల బిగింపు

నవీపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహంతం నుంచి బాసర వరకు కొనసాగుతున్న రైల్వే డబ్లింగ్ పనులలో భాగంగా రెండవ లైన్‌కు సంబంధించిన రైలు పట్టాల బిగింపు పనులు కొనసాగుతున్నాయి. మేడ్చల్ నుండి మహరాష్ట్రలోని ముఖేడ్ వరకు రైల్వే డబ్లింగ్ పనులు మంజూరు కాగా ప్రస్తుతం మండలంలోని మహంతం నుండి బాసర వరకు రైల్వే డబ్లింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఈ పాటికే 90శాతం వరకు పనులు పూర్తి కాగా మండలంలోని యంచ గోదావరి నదిపై రెండవ రైల్వే బ్రిడ్జి నిర్మాణం సైతం పూర్తయ్యింది. వచ్చే సంవత్సరం జనవరి నెలాఖరులోగా నూతన రైల్వే లైన్‌పై ట్రయల్ రన్ నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఫకీరాబాద్ స్టేషన్ సమీపంలో పట్టాల బిగింపు పనులు

వ్యవసాయ వ్యర్థాల కాల్చివేతతో.. భూసారానికి ముప్పు



- వరి పంట కోసిన తర్వాత పొలంలోనే కొయ్యల కాల్చివేత
- పర్యావరణ కాలుష్యంతో ఇబ్బందులు
- కలియ దున్నాలి : అధికారులు

ఆర్మూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరి పంట కోసిన తర్వాత పంట వ్యర్థాలను (వరి కొయ్యలు) కాల్చి వేయడంతో భూసారానికి ముప్పు వాటిల్లుతుంది. వర్షకాలంలో అనేక ప్రాంతాల్లో వరికోతలు పూర్తయ్యాయి. ఇటీవల సమృద్ధిగా వర్షాలు కురవడంతో యాసంగి పంటలకు భూములను సిద్ధం చేసు కుంటున్నారు. అయితే కూలీల కొరత కారణంగా రైతులు వరి పంటను కోత యంత్రాల (హార్వేస్టర్) ద్వారా కోయిస్తున్నారు. వరి కోత యంత్రాల ద్వారా పంటలు కోయడంతో వరి గడ్డి పైకి ఉంటుంది. భూములను సిద్ధం చేసే క్రమంలో వరి కొయ్యలకు నిప్పుపెట్టి కాల్చివేస్తున్నారు. దీనివల్ల వాతావరణం కాలుష్యంతో పాటు భూమి సారాన్ని కోల్పోతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అలాగే కాల్చివేత సమయంలో ప్రమాదాలు సంభవించే అవకాశాలు లేకపోలేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పంట పొలాల్లోని విద్యుత్‌వైర్లు, మోటర్లు, పైపులు కాలిపోయి నష్టాలకు గురయ్యే అవకాశం ఉంటుంది. రైతులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. గతంలో రైతులు తమ పొలాలను వ్యవసాయ కూలీలను పెట్టి కోయించేవారు. వరి కింది నుంచి కొడవల్లతో కోసేవారు. దీంతో పశువులకు వరిగడ్డి పుష్కలంగా లభించేంది. పొలాన్ని కలియదున్ని నీరు పారించడంతో కుళ్లిపోయి భూమి సారవంతం అయ్యేది.

భూసారం తగ్గిపోతోంది

వరికొయ్యలను కాల్చివేయడం వల్ల క్రమేపి భూసారం తగ్గిపోతుంది. వ్యవసాయ వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో

(తరువాయి 8వ పేజీలో....)



వేషం వేసి.. కోతులను తరిమేసి

6 లో

చలి చంపుతోంది!

- జిల్లాలో వేగంగా పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- శీతల గాలుల ప్రభావంతో ఉక్కిరిబిక్కిరి
- వృద్ధులు, చిన్నారులకు తప్పని చలి తిప్పలు
- సాలూరలో 9.9 డిగ్రీల అత్యల్ప కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

నిజామాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. రాత్రి 7దాటితే చాలు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. ఉదయం 8 తర్వాత నే జనాలు ఆరుబయటకి వస్తున్నారు. జిల్లాలో ఆదివారం 9.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సాలూరలో 9.9, బోధన్ మండలం చిన్నమావంది లో 10.2, నిజామాబాద్ నార్త్‌లో మాక్లూర్ మండలం మదన్‌పల్లిలో 10.4, వర్ని మండలం జాకోరాలో 10.5, నిజామాబాద్ నార్త్ గూపన్‌పల్లిలో 10.7, ఇందల్‌వాయి మండలం గన్నారంలో 10.9, ఆర్మూర్ ఇసపల్లి, ధర్పల్లి, మంచిప్పలలో 11, సిరికొండ మండలం తూంపల్లి, పెర్కిట్‌లలో 11.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలతో పాటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో గత రెండు రోజులుగా చలి తీవ్రత విపరీతంగా పెరుగుతోంది. దీంతో పిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లే వారు, వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు చలి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు 11 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు చూపిస్తున్నా.. ఉష్ణోగ్రతలు మాత్రం గణనీయంగా తగ్గిపోయాయి. అంతేకాకుండా జిల్లావ్యాప్తంగా 13 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవ్వడం గమనార్హం.



ఉత్తర్వులు అందినా.. ఉత్తిదేనా?!

- తెలంగాణ యూనివర్సిటీ అధికారుల వింతధోరణి
- కోర్టు ఉత్తర్వులు అందినా.. అమలులో జాప్యం
- కోర్టు ధిక్కారమని తెలిసినా.. భేఖాతరు

అక్రమ నియామకాలపై ఉలకరు పలకరు



● డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీ

నిజామాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ యూనివర్సిటీ అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. 2012లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నియామకాలు జరగగా ఆ నియామకాలు చెల్లవని వాటిని రద్దు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన వాటిని అమలు చేయడంలో అధికారులు కోర్టు ధిక్కారానికి పాల్పడుతున్నారు. గత నెల 31న తీర్పు వచ్చి ఉత్తర్వులు సైతం ఆన్‌లైన్‌లో ఉన్న దాదాపు 16 రోజులు గడుస్తున్న ఇంకా ఉత్తర్వుల కాపీ అందలేదనే నెపంతో అధికారులు కోర్టు ఉత్తర్వులను అమలు చేయడంలేదు. ఇప్పటికే కోర్టు ఉత్తర్వులు యూనివర్సిటీ అధికారులకు అందినట్లు తెలుస్తుంది. కానీ అక్రమ నియామకదారులకు వెన్నుదన్నుగా ఉండేందుకు యూనివర్సిటీ ఉన్నతాధికారులు కోర్టు ఉత్తర్వులు అందనట్లు ప్రచారం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏకంగా హైకోర్టే అక్రమ నియామకాలు పూర్తిగా రద్దుచేస్తూ కొత్త నోటిఫికేషన్‌లు ఇచ్చి నియామకాలు చేయాలని ఆదేశాలు ఇచ్చిన ఆ ఉత్తర్వులను అమలు చేయకుండా కోర్టు ధిక్కరణ చేస్తున్నామని తెలిసి అధికారులు వ్యవహరిస్తున్న తీరు అనేక అనుమానాలను కలిగిస్తుంది. విద్యార్థి సంఘాలు సైతం కోర్టు ఉత్తర్వుల కాపీలను వీసీతో పాటు రిజిస్ట్రార్‌కు అందజేసిన ఒరిజినల్ ఉత్తర్వులు వచ్చాకే స్పందిస్తామని బయటకి చెబుతున్న కోర్టు ఉత్తర్వులను తొక్కిపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత రెండు రోజుల క్రితం రిజిస్ట్రార్‌కు ఈ కేసును వాదించిన హైకోర్టు న్యాయవాది అటెస్ట్ చేసిన కోర్టుఉత్తర్వుల కాపీలను అందజేసినప్పటికి ఇంకా యూనివర్సిటీ ఉన్నతాధికారులు అక్రమంగా నియామకాలు పొందిన వారిని కాపాడే ప్రయత్నాలు చేస్తుండడం విస్మయానికి గురిచేస్తుంది. అక్రమ నియామకాలతో పాటు వారికి పదోన్నతులు కలిగించే విషయంలో కోట్లాది రూపాయలు చేతులుమారినట్లు ఆరోపణలు ఉన్నాయి. సుమారు 5 కోట్ల వరకు డీల్ కుదుర్చుకున్న ప్రస్తుతం యూనివర్సిటీలో ఉన్నతస్థానంలో ఉన్న ఓ వ్యక్తి కోర్టు ఉత్తర్వులను అమలు చేస్తే ఎక్కడ ఆ డబ్బులు తిరిగి చెల్లించాల్సి వస్తుందోనన్న భయంతో కోర్టు ఉత్తర్వులు యూనివర్సిటీకి వచ్చిన రానట్లు ప్రచారం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

అధికార పార్టీ నేతల పేరుతో కాలయాపన

తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌తో పాటు రిజిస్ట్రార్‌ను ఇటీవల విద్యార్థి సంఘాల నాయకులు కలిసి కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని వినతిపత్రాలు ఇచ్చిన సందర్భంలో వీసీతో పాటు రిజిస్ట్రార్‌లు పరస్పర దూషణలకు దిగినట్లు తెలుస్తుంది. విద్యార్థి సంఘాల నాయకులతో వీసీ, రిజిస్ట్రార్‌లు వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తుంది. జిల్లాకు చెందిన అధికార పార్టీ నేతలకు హైకోర్టు ఉత్తర్వుల విషయం తెలియజేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు తెలపగా వారికి అన్ని విషయాలు తెలసని వీసీ, రిజిస్ట్రార్‌లు వ్యాఖ్యానించడం వెనక అధికార పార్టీ నేతలను సైతం వీసీ, రిజిస్ట్రార్‌లు కోర్టు ఉత్తర్వుల విషయంలో తప్పుదోవపట్టిస్తున్నట్లు తెలుస్తుంది. జిల్లాకు మంజూరైన వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థలం విషయంలోనూ అధికార పార్టీలో

(తరువాయి 8వ పేజీలో.....)

క్రైం సమాచారం

కుక్కల దాడిలో ఐదు గొర్రెలు మృతి



వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన దృశ్యం

కామారెడ్డి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం ఇస్రోజివాడి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం వీధి కుక్కలు గొర్రెలపై దాడిచేసినట్లు గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శెట్కూరి సాయిలు గొర్రెలను మేపుతుండగా ఒక్కసారిగా పొదల్లో నుంచి వచ్చి గొర్రెలపై వీధికుక్కలు గుంపులుగా వచ్చి దాడి చేశాయి. దీంతో ఐదు గొర్రెలు మృతిచెందినట్లు బాధితుడు తెలిపారు. చిన్నదూడపై కూడా దాడిచేశాయన్నారు. ఈ ఘటనతో బాధితుడికి సుమారు రూ.45వేల వరకు నష్టం జరిగిందన్నారు. వీధి కుక్కలపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

తాడ్వాయి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) మండలంలోని దేవాయిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు తాడ్వాయి ఎస్సై నరేష్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన చెట్టి సతీష్ (29) ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం గడ్డిమందు తాగాడు. చికిత్స నిమిత్తం కుటుంబీకులు కామారెడ్డి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. కాగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. కాగా మృతునికి ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు.

మద్యం సిట్టింగ్.. కేసు నమోదు

లింగంపేట, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండలంలోని కోమట్‌పల్లి నంది చౌరాస్తా వద్ద అక్రమంగా మద్యం సిట్టింగ్ నిర్వహిస్తున్న దేవసోత్ సరిచెంద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. చౌరాస్తా వద్ద అక్రమంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తూ మద్యం సిట్టింగ్ ఏర్పాటుచేసినట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. ఈ మేరకు దాడి చేసి సరిచెంద్‌పై కేసు నమోదుచేశామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

లింగంపేట, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండలంలోని పర్మల్ల వద్ద ఉన్న పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుకను లింగంపేటకు తరలిస్తున్న 3 ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్సై దీపక్ కుమార్ తెలిపారు. లింగంపేట పెద్దవాగు నుంచి పర్మల్ల వద్ద కొందరు అక్రమంగా ఇసుకను తీసి లింగంపేటకు తరలిస్తున్నారని సమాచారం అందిందన్నారు. ఈ మేరకు లింగంపేట వద్ద ట్రాక్టర్లను పటుకుని కేసు నమోదుచేసినట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత



ఇస్రోజివాడిలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదె

కామారెడ్డి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం ఇస్రోజివాడి గ్రామంలో ఆదివారం విద్యుత్‌షాక్‌తో గేదె మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వివరాలు.. గ్రామంలోని పాడిరైతు శ్యామ్‌రావు చెందిన సూడితో ఉన్న గేదె మేతమేస్తూ పంటపొలంలో విద్యుత్ తీగలకు తగిలి అక్కడిక క్కడే మృత్యువాత పడిందన్నారు. విద్యుత్ సిబ్బంది అక్కడి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రూ.70వేల ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు. బాధిత వ్యక్తికి న్యాయం చేయాలని ట్రాన్స్‌కో అధికారులను కోరారు.

అక్లూర్‌లో యువకుడు అదృశ్యం



అనిందర్ రెడ్డి

వేల్పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్లూర్ గ్రామానికి చెందిన గంగం అనిందర్ రెడ్డి (29) ఈ నెల 3వ తేదీ నుంచి కనిపించడం లేదని ఎస్సై సంజీవ్ తెలిపారు. 3వ తేదీన ఇంటి నుంచి ఆర్మూర్‌కు బ్యాంక్ పనినిమిత్తం వెళ్తున్నానని తండ్రికి చెప్పి వెళ్లాడు. ఇప్పటివరకు ఇంటికి రాలేదన్నారు. కుటుంబీకులు చుట్టుపక్కల గ్రామాల్లో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వేల్పూర్ పోలీస్ స్టేషన్‌లో తండ్రి చిన్న గంగారెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మాలల రణభేరి పోస్టర్ విడుదల



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాల మహనాడు నాయకులు

ఆలూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాల మహనాడు మండల అధ్యక్షుడు అగ్గు క్రాంతి ఆధ్వర్యంలో మాలల రణబేరి మహసభ పోస్టర్, కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అగ్గు క్రాంతి మాట్లాడుతూ.. ఈ నెల 23న హైదరాబాద్ సరూర్ నగర్ గ్రౌండ్‌లో జరగనున్న మాలల రణబేరి మహాసభను విజయవంతం చేయాలని, ఈ కార్యక్రమం ద్వారా మాల సమాజ హక్కులు అభివృద్ధి కోసం ప్రతీ కుటుంబం సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ పెండ ఉదయ్, అర్గ ప్రదీప్, గంగాధర్, సజన్, శ్రీకర్, ఉమ్మెడ రాకేష్, తలారి మల్లేష్, రణవీర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసహాయం



ఆర్థికసహాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోర్తాడ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మార్కెట్ కమిటి డైరెక్టర్ నవీద్ అమ్మ మరణించడంతో ఈ విషయం తెలుసుకొని బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ అంత్యక్రియలకు రూ. 10వేల ఆర్థిక సహాయం పంపించారు. ఈ ఆర్థిక సహాయాన్ని మండల మోర్తాడ్ పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్ పదివేల ఆర్థిక సహాయం నవీద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ మహిపాల్, జైడి చిన్న గంగారాం, గిర్మాజి గంగాధర్, అమ్‌జాద్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభిమానం అభివృద్ధి అయిన వేళ

- ఆదర్శంగా ఐఈఆర్పీ శుభారాణి
- భవిత కేంద్రం నిర్వహణకు సొంత ఖర్చుతో గది నిర్మాణం



నవీపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల 18 ఏళ్ల లోపు గల పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యను అందించడానికి ప్రభుత్వం విలీన విద్య వనరుల (భవిత) కేంద్రాలను ఏర్పాటుచేసింది. 15 సంవత్సరాల లోపు గల వారికి పాఠశాల స్థాయిలో, అంతకు పైబడిన వారికి కళాశాల స్థాయిలో ప్రత్యేక తరగతులను బోధిస్తున్నారు. దివ్యాంగులైన పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడం, మాట్లాడడం, నడిపించడం వంటి వాటి కొరకు నిపుణులను నియమించి కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో ఈ పాఠశాలలను ఏర్పాటు చేయగా నవీపేటకు చెందిన భవిత కేంద్రం స్థానిక దర్యాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. గతంలో పక్కనే ఉన్న పాత ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన శిథిలావస్థ భవనంలో ఈ భవిత కేంద్రం కొనసాగగా మూడేళ్ల క్రితం ఈ కేంద్రాన్ని పాఠశాల ఆవరణలోకి మార్చారు. పాఠశాలలో సైతం అదనపు గదులు లేక పోవడంతో కేంద్రం నిర్వహణ కష్టంగా మారింది.



నూతనంగా నిర్మించిన గది ఇదే..

దాతల సహకారంతో సొంత భవనం..

దీంతో ఐఈఆర్‌పీ(ఇన్‌క్లూజివ్ ఎడ్యూకేషన్ రిసోర్స్ పర్సన్) శుభారాణి రెండేళ్ల క్రితం రూ.1.50 లక్షల సొంత ఖర్చుతో భవిత కేంద్రానికి ప్రత్యేక గదిని నిర్మించారు. ఆమె బాటలోనే దర్యాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలిగా పని చేసిన మమత తనవంతుగా రూ.50వేలు సమకూర్చి గది నిర్మాణానికి సహకారం అందించారు.

21రకాల వైకల్యాలు ఉన్న పిల్లలకు

దృష్టి లోపం, శ్రవణ లోపం, బుద్ధిమాంద్యం, ఆటిజం వంటి 21 రకాల బహుళ వైకల్యం గల విద్యార్థులకు ఆటపాటల ద్వారా ఈ కేంద్రంలో విద్యను అందిస్తున్నారు. పాఠశాలలో చదివే బాలికలకు రూ.700, బాలురకు రూ.500 చొప్పున ప్రతి నెల ప్రభుత్వం స్కాలర్ షిప్ అందిస్తుంది. వారానికి 2 రోజుల చొప్పున విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా స్థానిక భవిత కేంద్రం పక్కనే నూతన భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం ఇటీవల 10.70లక్షల రూపాయలను మంజూరు చేయగా త్వరలోనే భవన నిర్మాణ పనులను చేపట్టనున్నారు.

అభిమానంతో గదిని నిర్మించాను



ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సౌకర్యవమైన గది అవసరం. మొదట పాత ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన శిథిల భవనంలో భవిత కేంద్ర నిర్వహణ కష్టంగా ఉండేది. పిల్లలపై అభిమానంతో సొంతఖర్చుతో గదిని నిర్మించడం ఆనందాన్ని కలిగించింది.

\- శుభారాణి, భవిత కేంద్రం ఐఈఆర్‌పీ, నవీపేట

యువత క్రీడల్లో రాణించాలి

బోధన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని బెల్లాల్ గ్రామానికి చెందిన అన్నపూర్ణ నీలకంఠం గౌడ్ అన్నారు. ఆదివారం బోధన్ మండలం బెల్లాల్ గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న యువకుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడం కోసమే క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడలలో రాణించడం వల్ల యువత తమ జీవితాన్ని ఉన్నతంగా మార్చుకోవచ్చని, క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

కోటగిరి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి, సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నుంచి 2 రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పోల విఠల్ తెలిపారు. హోమం, యజ్ఞం, పడిపూజ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

ఎంఐఎం అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలి

బోధన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బోధన్‌లో రానున్న మున్సిపల్ ఎన్నికలలో ఎంఐఎం పార్టీ అభ్యర్థుల గెలుపునకు పార్టీ ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎంఐఎం రాష్ట్ర అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. ఆదివారం బోధన్ ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు మీర్ ఇలియాస్ అలీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణ అధ్యక్షుడు మీర్ ఇలియాస్ అలీ మాట్లాడుతూ.. బీహార్‌లో ఐదు స్థానాల్లో ఎంఐఎం పార్టీ గెలిచినందుకు రాష్ట్ర అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే మున్సిపల్ ఎన్నికలలో బోధన్ పట్టణంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, మున్సిపల్ చైర్మన్ పదవిని ఎంఐఎం కైవసం చేసుకునేలా ప్రత్యేక దృష్టికి కేంద్రీకరించాలని ఓవైసీని కోరినట్లు ఆయన తెలిపారు. బీహార్‌లో ఐదుస్థానాలను ఎంఐఎం గెలుచుకుందని, అలాగే రానున్న ఎన్నికలలో ఎంఐఎం పార్టీ అభ్యర్థులు అనేక చోట్ల విజయం సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ వెళ్లిన వారిలో పార్టీ నాయకులు హైమద్ బిన్ మొసిన్, ఖదీర్ ఖాన్, హాజీ బిల్డర్, అబ్దుల్ రహమాన్, అక్తర్, సమీర్‌లతో ఎంఐఎం పార్టీ మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



ఓవైసీని కలిసిన బోధన్ ఎంఐఎం నాయకులు

ఢిల్లీకి తరలివెళ్లిన ఎమ్మార్పీఎస్ నాయకులు

కోటగిరి,నవంబరు16(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి చేయడాన్ని నిరసిస్తూ ఢిల్లీలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన మహ ధర్నా కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. కోటగిరి మండల కేంద్రం నుండి ఆదివారం ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోచీరాం ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ గవాయ్‌పై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఛలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కోటగిరి నుంచి ఢిల్లీకి తరలివెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వేషం వేసి.. కోతులను తరిమేసి

కమ్మర్‌పల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వానరాలను తరిమికొట్టేందుకు కమ్మర్‌పల్లి మండలం హసాకొత్తూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఓ వినూత్న ప్రయత్నం చేసింది. కరీంనగర్ జిల్లాలోని ఓ గ్రామంలో కోతులను తరిమేందుకు ఓ వ్యక్తికి చింపాంజీ వేషం వేసి గ్రామంలో తిప్పగా కోతులు గ్రామం విడిచి వెళ్లాయని ఓ న్యూస్‌లో చూసి తెలుసుకున్నారు. దీంతో వారు కూడా ఆన్‌లైన్‌లో ఎలుగుబంటి వేశానికి కావాల్సిన డ్రెస్‌ను బుక్ చేసి తెప్పించారు. గ్రామసేవలో భాగంగా ఓ యువకుడికి ఎలుగుబంటి వేషం వేసి గ్రామంలోని వీధుల్లో తిప్పించారు. దీంతో చాలావరకు కోతులు పారిపోయాయి. గ్రామ కమిటీ అధ్యక్షుడు ధర్పల్లి సతీష్, గ్రామస్థులు ఆ యువకుడిని అభినందించారు.



ఎలుగుబంటి వేషధారణలో తిరుగుతున్న యువకుడు

పేదల కల కాంగ్రెస్ నెరవేర్చింది

వేల్పూర్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి కుటుంబాల చిరకాల కోరిక సొంతింటి కలను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం వేల్పూర్ మండలంలోని పోచంపల్లి గ్రామవాసి రాజుకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డితో కలిసి నూతన గృహ ప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో మరింత మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. ఇళ్లు లేని పేదవారు ఉండకూడదన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని, రానున్న రోజుల్లో మరింత మంది అర్హులైన వారికి ఇళ్లు కేటాయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న దృశ్యం

పేదలకు అల్పాహారం పంపిణీ



పేద విద్యార్థులకు పండ్లను అందజేస్తున్న దృశ్యం

బోధన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా బోధన్ పట్టణంలో ఆదివారం సామాజిక సేవకులు అశోక్ కుమార్ రోడే పేద పిల్లలకు పండ్లు, అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని 1వ వార్డు ఆచన్‌పల్లి ప్రాంతంలో ఉన్న నిరుపేదలకు చెందిన పిల్లలకు పండ్లు, అల్పాహారాన్ని అందజేశారు. పట్టణ సీఐ వెంకట నారాయణ హజరై పండ్లను అందజేశారు. ప్రభుత్వానికి, అధికారులకు వారధిగా ఉంటూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా జర్నలిస్టుల పాత్ర విశేషమని కొనియాడారు. ఇలాంటి సేవాకార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని సీఐ అశోక్ కుమార్ రోడేను అభినందించారు.

సెలవు పూట.. శ్రమదానం బాట



తపస్వి ఆవరణలో శ్రమదానం నిర్వహిస్తున్న సంస్థ సభ్యులు

ఆర్మూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధి మామిడిపల్లి వెంకటేశ్వర కాలనీలోని తపస్వీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆవరణలో ఆదివారం మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. పాఠశాల ఆవరణ, పరిసర ప్రాంతాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. తపస్విలో చదువుతున్న పిల్లలకు ప్రతిఒక్కరు సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆదివారం అల్పాహారంతో పాటు బియ్యం బస్తాను అందజేశారు. తపస్వీ జనరల్ సెక్రటరీ దిలిప్, డైరెక్టర్ శ్రీనివాస్, అడ్మిన్ ఇంచార్జి కవిత, వైస్ ప్రిన్సిపాల్ అనూష, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



మిర్దాపల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఆర్మూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం మిర్దాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాలలో 2000-2001 పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 24 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. ఒకరికొకరు పలకరించుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జే. రవి, జగదీష్, ధర్మపురి సూరి, మధు, నవీన్, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాదానం ఎంతో గొప్పది

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి

జక్రాన్‌పల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కంటే విద్యాదానం ఎంతో గొప్పద ని తమ వృత్తి ధర్మాన్ని అంకిత భావంతో నెర వేర్చి విద్యార్థులకు మంచిగా బోధించినప్పుడే ఉ పాధ్యాయులకు గుర్తింపు వస్తుందని నిజామా బాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అన్నా రు. ఆదివారం మండలంలోని తొర్లికొండలో కొలిప్యాక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన జెస్సు వినోద్ కుమార్ పదవీ విరమణ సన్మాన సభకు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య అభివృద్ధి కోసం పెద్ద పీట వేస్తుందన్నారు. రాష్ట్రంలోని పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుం దన్నారు. అనంతరం వినోద్ కుమార్, మంజుల దంప తులను శాలువ, పూలమాలలు, మెమెంటోతో సత్కరిం చారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయిరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చిన్నరెడ్డి, ఉపాధ్యక్షు డు శ్రీనివాస్ గౌడ్, బ్రాహ్మన్‌పల్లి సొసైటీ చైర్మన్ కాటిపల్లి నర్సారెడ్డి, ఆర్మూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ కనక రవి, మాజీ సర్పంచ్‌ల పోరం జిల్లా అధ్యక్షుడు గోర్త రాజేందర్, పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్, మండల పీఆర్‌టీయు అధ్యక్షుడు గోపి, మండల ప్రధాన కార్యదర్శి రవీన్, బీజేపీ నాయకులు అల్జాపూర్ శ్రీనివాస్, తొర్లికొండ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటి చైర్మన్ సంజీవ్‌గౌడ్, ఉపాధ్యాయులు, విడిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

ఊరు మురుగంతా పంట పొలంలోకి..



పంట పొలాల్లోకి చేరిన మురుగు నీరు

వేల్పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలోని ఎస్సీవాడ సమీపంలో ఉన్న పంట పొలాల్లోకి మురికి నీరు పారడంతో పంటలు దెబ్బతింటున్నాయని వాటి నుంచి పంట పొలాలను కాపాడాలని అయ్యల పొలం (జావతోట) బాధిత రైతులు అధికారులను కోరుతున్నారు. స్థానిక గురడిరెడ్డి సంఘం నుంచి జావతోట వినోద్ ఇంటి వరకు మురికి కాలువ గతంలో నిర్మించి వదిలేశారని, దీంతో గ్రామానికి చెందిన మురికినీరంతా తమ పంట పొలాల్లోకి చేరి ఇబ్బందికరంగా మారిందన్నారు. మాజీ సర్పంచ్ హయాంలో మురికి కాలువ సగం వరకే నిర్మించి వదిలేయ డంతో తమకు ఈ సమస్య ఎదురైందన్నారు. గ్రామంలోని అన్ని మురికి కాలువల ద్వారా వచ్చే మురికి నీరుతో పాటు ప్లాస్టిక్ డబ్బలు, ఇతర చెత్తచెదారం తమ పంట పొలాల్లోకి చేరడంతో పండ పాడవుతోందని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు జీపీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

భీమ్‌గల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ వసతి గృహ విద్యార్థులకు భీమ్‌గల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లను ఆదివారం అందించారు. చలి తీవ్రంగా పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు వెచ్చని ఆదరణ కల్పించాలనే ఆలోచనలతో దుప్పట్లను అందజేస్తున్నట్లు భీమ్‌గల్ వేముగల్లు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షుడు డాక్టర్. పడాల పురందర్, కార్యదర్శి గజ్జెల చైతన్య, కోశాధికారి ఎడ్ల శేఖర్, ఉపాధ్యక్షుడు హన్మాండ్లు, ప్రసాద్, పీఆర్వో లింబాద్రి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీకాంత్, రమావత్, సహయ కో-ఆర్డినేటర్ లింబాద్రి, ఇమ్మానుయేల్, శ్రీనివాస్, హన్మంతు, సభ్యులు, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నేడు శివపార్వతుల కల్యాణం



బీర్కూర్‌లో వాటర్ బాటిళ్లను అందజేస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్షపల్లి సాయిరెడ్డి తెలిపారు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టి, 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో కల్యాణం ఉంటుందని తెలిపారు. భక్తుడు భీంరాజ్ కుటుంబ సభ్యులు కల్యాణం, అన్నదానం జరిపిస్తున్నారని, భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీర్కూర్: కార్తీక సోమవారం సందర్భంగా సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలోని తోట్ల హనుమాన్ మందిరంలో కార్తీక దీపోత్సవం, రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మాదప్ప స్వామి తెలిపారు. కాగా భక్తుల కోసం లయన్స్ క్లబ్ సభ్యులు తమవంతుగా ముందస్తుగా వాటర్ బాటిళ్లను అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదప్ప స్వామి కోరారు. కార్యక్రమంలో బీర్కూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేష్, లయన్స్ గాలయ్య, విఠల్, రషీద్, శ్రీనివాస్, గంగాధర్ గౌడ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్రా రామారావు

నిజామాబాద్ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, కుల, మతోన్మాదాలకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నర్రా రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం పీడీఎస్‌యూ 23వ నగర మహాసభలు జిల్లాకేంద్రంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో నిర్వహించారు. పీడీఎస్‌యూ జెండాను ఆవిష్కరించారు. ఈ సభకు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నర్రారామారావు హాజరై మాట్లాడుతూ.. కుల, మత విద్వేషాలు లేని నూతన సమాజ నిర్మాణం కోసం యువత కృషిచేయాలన్నారు. పౌరహక్కుల సంఘం నేత వాల్గొట్ రవీందర్ మాట్లడుతూ.. దోపిడి, పీడన లేని సమాజం కోసం ప్రతి విద్యార్థి ఉద్యమించాలన్నారు. విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవాటుచేసుకోవాలన్నారు. మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావజాలానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నగర కార్యదర్శి ముస్కె సుధాకర్, పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి,. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్కె గణేష్, వనమాలకృష్ణ, గంగాదర్, లింగం, బాస్కర్‌స్వామి, ప్రేమ్‌సింగ్, విఠల్, కిరణ్, సాయిబాబా, చరణ్, రాజన్న, తారాచంద్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నగర కమిటీ ఎన్నిక..

ఈ నగర మహాసభలో పీడీఎస్‌యూ నగర నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. నగర అధ్యక్షునిగా నసీర్, ప్రధాన కార్యదర్శిగా వినోద్, ఉపాధ్యక్షుడిగా నగేష్, సహాయ కార్యదర్శిగా సృజన్, కోశాధికారిగా వికాస్, సభ్యులుగా మహేందర్, మణితేజ, బన్నీ, అభిలాష్‌లతోపాలు ఐదుగురు కో-ఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎమ్మెల్యే పీఏపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

నిజామాబాద్ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలం మైలారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించకుండా రూరల్ ఎమ్మెల్యేకు పీఏగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని కోటగల్లిలోని ఎన్ఆర్‌భవన్‌లో పీడీఎస్‌యూ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర రావు మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధుల వద్ద ప్రభుత్వ ఉపాధ్యాయులు పనిచేయవద్దన్న ప్రభుత్వ నిబంధనను, కోర్టు ఉత్తర్వులను శ్రీనివాస్ రెడ్డి ఉల్లంఘించారన్నారు. విద్యాహక్కు చట్టం, సుప్రీంకోర్టు నిబంధనలు ఉల్లంఘించి రూరల్ ఎమ్మెల్యే వద్ద దీర్ఘకాలం పీఏగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డిపై జిల్లా విద్యాశాఖాధికారి చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. పాఠాలు చెప్పకుండా ఎమ్మెల్యే వద్ద పనిచేయడానికి శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వం నుంచి ఏమైనా ప్రత్యేకమైన అనుమతి తీసుకున్నారా అని ప్రశ్నించారు. పేద విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు పీఏగా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం ఏమిటని ప్రశ్నించారు. గతంలోనే ఈ వ్యవహారం పై ఎంఈవో, డీఈవోలకు ఫిర్యాదుచేశామని గుర్తుచేశారు. వెంటనే శ్రీనివాస్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు నికిల్, మనోజ్, పవన్‌కుమార్, సాయికుమార్, రాజేష్, శంకర్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.



కమ్మేస్తున్న పొగలో.. ముసుగేస్తున్న చదువులు

- పాఠశాలలకు అందని గ్యాస్ సిలిండర్లు
- కట్టెల పొయ్యిపై వంట చేయిస్తున్న వైనం
- పొగతో విద్యార్థులకు ఇక్కట్లు
- అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు

మద్నూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేసేందుకు గ్యాస్ సిలిండర్లు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనివా ర్యంగా కట్టెల పొయ్యిమీద వంట చేస్తుండటంతో పొగతో వంట నిర్వాహకులు, ఉక్కిరిబిక్కిరి అవు తున్నారు. అంతేకాకుండా తరగతి గదుల్లోకి పొ గ చేరుతుండటంతో విద్యార్థులు ఉపాధ్యాయు లు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విద్యార్థులు చదువుపై సరిగా దృష్టిసారించలేకపోతున్నారు.

సరైన సమయంలో అందక..

ప్రభుత్వం అన్ని పాఠశాలలకు సిలిండర్లు ఇవ్వాల్సి ఉండగా సకాలంలో సిలిండర్లు అందటం లేదని ఏజెన్సీ నిర్వాహకులు వాపోతున్నారు. పాఠశాల ఆవరణలోనే కట్టెల పొయ్యిపై వంట లు చేస్తుండటంతో తరగతి గదుల్లో పొగ చేరు తుంది. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా రు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించలేకపో తున్నారు. ఆరు బయట వంట చేస్తుండటంతో ఆహార పదార్థాల్లో దుమ్ము, ధూళి పడుతోందని పొగచూరి భోజనం రుచిగా ఉండటం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వంట చేసేందుకు మరింతగా ఇబ్బంది పడుతున్నామని ఏజెన్సీ నిర్వాహకులు వాపోతున్నారు. వంట చెరుకు కోసం తిప్పలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అన్ని పాఠశాలలకు సకాలంలో సిలిండర్లు అందేలా ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. అటు విద్యార్థులకు ఉపాధ్యాయులకు వంట చేసేవారికి ఇబ్బందులు తప్పుతాయని అంటున్నారు.



కట్టెల పొయ్యిపైనే వంట చేస్తున్న మహిళ

వడివడిగా ధాన్యం కొనుగోళ్లు

నాగిరెడ్డిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. మండల వ్యాప్తంగా ఐకేపీ, సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 24 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 2950 రైతుల నుంచి 1,42,717 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 13 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 1161 మంది రైతుల నుంచి 52,810 క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు చేసినట్లు ఐకేపీ ఏపీఎం రాం నారాయణ గౌడ్ తెలిపారు. తాండూర్ సొసైటీ ఆధ్వర్యంలో 7 కొనుగోలు కేంద్రాల ద్వారా 1139 మంది రైతుల నుంచి 61024 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సొసైటీ సీఈవో మురళి తెలిపారు. మాల్తుమ్మెద సొసైటీ ఆధ్వర్యంలో 4 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 650 మంది రైతుల నుంచి 28,883 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు సొసైటీ సీఈవో సందీప్ కుమార్ తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల అనంతరం రైతుల వివరాలను ఆన్‌లైన్ చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో అధికారులు డబ్బులు జమ చేస్తున్నారు. మరో వారం, పది రోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియ మండలంలో పూర్తవనున్నట్లు తెలుస్తోంది.



మాల్తుమ్మెదలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

బాలరత్న అవార్డుకు విభశ్రీ

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కళాకార్ బాలరత్న అవార్డుకు నిజామాబాద్ జిల్లాకు చెందిన నృత్య కళాకారిణి తేలి విభశ్రీ (కామాఖ్య) ఎంపికయ్యారు. తనదైన శైలిలో శాస్త్రీయ నృత్యం, వెస్ట్రన్ డ్యాన్స్, ఫోక్ డ్యాన్సులతో పాటు పలు టీవీషోలు, పలు ఫ్యాషన్ షోలు చేసినందుకు మల్టి ఫుల్ ట్యాలెంట్ గర్ల్‌గా కెమెరామెన్ సయ్యద్ మీర్, ట్వింకిల్ కపూర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న విభశ్రీ ఈ సందర్భంగా గురువు వినయ్ కుమార్, శ్రీనివాస్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌లకు ధన్యవాదాలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న విభశ్రీ

రాష్ట్రస్థాయి పోటీలకు మద్నూర్ విద్యార్థులు

మద్నూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగిన అండర్- 17, అండర్- 14 ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభను చూపారని కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు జాదవ్ గణేశ్ ఆదివారం తెలిపారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలో జరిగిన ఖోఖో అండర్- 17 విభాగంలో గోతి జగదీశ్, జవహర్ సింగ్, సీహెచ్ జ్ఞానేశ్వర్, కె.బాలాజీ, బి.రామకృష్ణ, ఖోఖో అండర్-14 విభాగంలో జోవెగ్ర రమేశ్, యం.సాయితేజ, సీహెచ్ అర్జున్, కె.నవదీప్‌లు ప్రథమ, ద్వితీయ బహుమతులను గెలుచుకున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి రాజు, ఎస్జీఎఫ్ అధికారి హీరాలాల్ చేతులమీదుగా బహుమతులు అందుకున్నట్లు వెల్లడించారు. ఈ విద్యార్థులే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, ప్రముఖ పద్యకవి డా.బి.వెంకట్, సుధాకర్, గణేశ్, పీబీ నాగరాజు, రక్షకుడు ప్రవీణ్ కుమార్, సుమన్, వేణుగోపాల్, సంతోష్, నరహరి ప్రసాద్, రాము, సంజు, దత్తు, గంగా ప్రసాద్, అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయ బృందం

కల్లు తాగితే రూ.5వేల జరిమానా

- వీడీసీ పెద్దల హుకూం జారీ
- సీపీని ఆశ్రయించిన కల్లు కార్మికులు

మోపాల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీల పెత్తనం రోజురోజుకూ పెరిగిపోతుందని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సిర్పూర్ గ్రామంలో ఓ కల్లుగీత కార్మికుడు కల్లు అమ్ముకుంటే అతని దగ్గర ఎవరైనా కల్లు తాగితే 5వేల జరిమానా విధిస్తామని హెచ్చరికలు జారీ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. సిర్పూర్ గ్రామంలో ముగ్గురు కల్లుగీత కార్మికులు ఎవరికి వారే కల్లును విక్రయిస్తున్నారు. ఓ విక్రయదారుడు రూ.20వేలు, మరో విక్రయదారుడు రూ.16వేలను నెలనెలా వీడీసీకి చెల్లిస్తున్నారు. మరో విక్రయదారుడు ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడం వల్ల వీడీసీకి డబ్బు ఇవ్వలేనని చెప్పాడు. దీంతో అతని వద్ద ఎవరైనా గ్రామస్థులు కల్లుతాగితే రూ.5వేల జరిమానా విధిస్తామని ఆయా కుల పెద్దలకు చెప్పారు. ఆయా కులాలలో ఉన్న సభ్యులకు ఈ విషయాన్ని తెలియజేయాలని వీడీసీ పెద్దలు హుకూం జారీ చేసినట్లు బాధితుడు దశాగౌడ్ ఇటీవల సీపీ సాయిచైతన్యకు ఫిర్యాదు చేశాడు. తన దుకాణానికి ఎవరూ కల్లు తాగడానికి రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని తనకు న్యాయం చేయాల్సిందిగా సీపీకి వినతిపత్రంలో కోరాడు. ఈ విషయాన్ని మోపాల్ పోలీసులకు ఉన్నతాధికారులు అందజేశారు. ఈ విషయంపై ఎస్సై సుష్మితను వివరణ కోరగా జరిమానా విధిస్తామని హెచ్చరికలు జారీ చేస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ విషయంపై వీడీసీ పెద్దలను పిలిపించి అడగగా తాము జరిమానా విధిస్తామని చెప్పలేదని వీడీసీ పెద్దలు తమకు తెలియజేశారని ఎస్సై తెలిపారు.

ఇసుక లేక.. ఆగిన ఇళ్లు

- మంజీరాలో ప్రవహిస్తున్న వరద నీరు
- వరద ప్రవాహంతో ఇసుక కొరత

బీర్కూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దే శ్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చు ట్టింది. ఈ పథకం ద్వారా ఇళ్ళు లేని పేదలకు ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసింది. లబ్ధిదా రులు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. కొంతమంది లబ్ధిదారులు పనులు ప్రారంభించా రు. మరి కొందరు ఇంకా షురూ చేయలేదు. ఇదిలా ఉండగా ఇటీవల భారీ వర్షాలు కురిశాయి. మంజీరా నదిలో భారీగా వరద నీరు వచ్చి చేరింది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండడంతో గేట్ల ద్వారా వరద నీటిని మంజీరా నదిలోకి వదిలారు. నది నిండుగా పారుతుంది. దీంతో ఇసుక కొరత తీవ్రంగా ఏర్పడింది. ఇసుక కొరత కారణంగా బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల్లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా కొంతమంది లబ్ధిదారులు బ్లాక్‌లో ఇసుకను అధిక ధరలకు కొనుగోలు చేస్తూ పనులు చేప డుతున్నారు. ప్రస్తుతం మంజీరా నదిలో నీటి ప్రవాహం తగ్గుతుంది. ఇసుక అనుమతి కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. అధికారులు నదిని పరిశీలించి ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



బీర్కూర్‌లో నిలిచిన ఇంటి నిర్మాణ పనులు

మలావత్ పూర్ణ కుటుంబానికి పరామర్శ



పూర్ణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

సిరికొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎవరెస్టు శిఖరాన్ని చిన్న వయస్సులోనే అధిరోహించిన మలావత్ పూర్ణ కుటుంబాన్ని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పరామర్శించారు. పూర్ణ తండ్రి ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఆదివారం సిరికొండ మండలం పాకాల గ్రామంలోని ఆమె ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. వారు నూతనంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణానికి సహాయం చేయడంతోపాటు పూర్ణ సోదరుడికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

మాజీ ఎంపీటీసీ కుటుంబాన్ని..

మండలంలోని హుస్సేన్ నగర్‌లో మాజీ ఎంపీటీసీ సంతోష్ కుటుంబాన్ని బాజిరెడ్డి గోవర్ధన్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ రాజన్న, భూషణ్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

నిలిచిన రాజీవ్ యువవికాస్

- రుణాల కోసం యువతకు తప్పని నిరీక్షణ
- 13,450 మంది లబ్ధిదారుల ఎంపిక
- ఎదురు చూస్తున్న యువత

కామారెడ్డి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాస్ పథకం ఆదిలోనే అంసపాదు అన్నచందంగా మారింది. దీంతో జిల్లాలో యువత తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ల పరిధిలో 13,450 యూనిట్లు మంజూరయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 44,631 మంది నిరుద్యోగులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోగా అధికారులు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి 13,450 మందిని ఎంపిక చేశారు. అర్హులైన లబ్ధిదారులకు గత జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రొసీడింగ్స అందజేయనున్నట్లు అప్పట్లో అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో లబ్ధిదారుల జాబితాను ఇంచార్జి మంత్రి అప్రూవల్ కోసం అధికారులు పంపించారు. ఏమైందో తెలియదు కాని అందజేయలేదు. అప్పటి నుంచి జిల్లాలోని యువత ఆశగా ఎదురు చూస్తున్నారు.

వచ్చిన దరఖాస్తులు 44,631

జిల్లాలోని 535 గ్రామ పంచాయతీలు, మూడు మునిసిపాలిటీల పరిధిలో రాజీవ్ యువ వికాస్ పథకానికి 44,631 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కార్పొరేషన్ల వారీగా చూస్తే ఎస్సీ కార్పొరేషన్‌కు 8,335 దరఖాస్తులు రాగా, ఎస్టీ కార్పొరేషన్‌కు 4,580 దరఖాస్తులు రాగా, బీసీ కార్పొరేషన్‌కు 23,946, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు 1,046, ముస్లిం మైనార్టీ 6,663, క్రిస్టియన్ మైనార్టీలకు 116 దరఖాస్తులు వచ్చాయి.

జిల్లాలో యూనిట్ల లక్ష్యం 13,450

జిల్లాలో జనాభా ప్రతిపాదికన కులాల వారీగా ఈ పథకానికి యూనిట్లను ప్రభుత్వం కేటాయించింది. జిల్లా వ్యాప్తంగా 13,450 యూనిట్ల లక్ష్యంగా నిర్ణయించింది. ఎస్సీ కార్పొరేషన్ యూనిట్ల లక్ష్యం 4,104, ఎస్టీ కార్పొరేషన్ యూనిట్ల లక్ష్యం 2,366, బీసీ యూనిట్ల లక్ష్యం 4,638, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ యూనిట్లు 1,271, ముస్లిం మైనార్టీ యూనిట్లు 977, క్రిష్టియన్ మైనార్టీ యూనిట్లు 44గా ప్రభుత్వం కేటాయించింది. పథకంలో రూ.50వేలు, రూ.లక్ష, రూ.2లక్షల నుంచి రూ.4లక్షల రుణాలు అందిస్తుండగా రూ.50వేలకు 100శాతం రాయితీ, రూ.50వేల నుంచి లక్ష వరకు 90శాతం, రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు 80 శాతం, రూ.2లక్షల నుంచి రూ.4 లక్షల వరకు 70 శాతం ప్రభుత్వం అందిస్తుందని ప్రకటిం చింది. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉ ద్దేశ్యంతో ప్రభుత్వం యువత నుంచి దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారులను ఎంపిక చేసినా ఇంతవరకు ప్రొసిడింగ్ అందజేయకపోవడంతో వారంత నిరుత్సాహంతో ఉన్నారు.

వానర దండు.. భయం మెండు

- వందల సంఖ్యల్లో వానరాల సంచారం
- వానర సైన్యం ధాటికి ప్రజలు బెంబేలు
- ఇళ్లలోకి చొరబడుతున్న వైనం
- గాయాల పాలవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

బాన్సువాడ టౌన్ , నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలో వానరసైన్యం స్వైరవిహారం చేస్తున్నాయి. రోజురోజుకు కోతుల సంఖ్య పెరిగిపోతోంది. పెరుగుతున్న కోతుల సంఖ్యను చూస్తుంటే బాన్సువాడ మరో కిష్కింధకాండను తలపిస్తుంది. నిత్యం వందల సంఖ్యలో వానరాలు పలు కాలనీల్లో తిరుగుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు వాటి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. బయటకు వెళ్లి తిరిగి ఇళ్లకు చేరుకోవాలంటే ప్రహరీలపైనే తిష్టవేయడంతో ప్రజలు జంకుతున్నారు. అంతేకాకుండా ఇళ్లలో చొరబడి తినుబండారాలను ఎత్తుకెళ్లిపోతున్నాయి. తరిమేద్దానుకున్న వారిపై దాడులు చేస్తున్నాయి. ఇప్పటికే చాలా మంది కోతుల దాడిలో గాయాల బారిని పడి ఆస్పత్రుల పాలైన సంఘటనలు కూడా ఉన్నాయి. వానరాలను నియంత్రించాలని ప్రజలు అధికారులకు మొరపెట్టుకుంటున్నప్పటికీ ఫలితం మాత్రం శూన్యంగానే ఉంది.

ఇళ్లలోకి ప్రవేశించి..

వానరసైన్యం ఆహారం కోసం ఇళ్లలోకి చొరబడుతున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని శ్రీరామ కాలనీ, టీచర్స్‌కాలనీ, భేతాళస్వామి కాలనీ, పాతబాన్సువాడ, సంగమేశ్వర కాలనీలతో పాటు పలు కాలనీల్లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇళ్లలోకి ప్రవేశించి వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. ఎవరైనా తరిమేద్దామని చూస్తే వారిపై దాడికి పాల్పడుతున్నాయి. పెంకుటిళ్లలో నివసించే వారి పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. కోతులు పెంకులు ఊడదీస్తున్నాయి. చాలా కాలనీల్లో విద్యార్థులు జంకుతున్నారు.

ఫలితం ఇవ్వని ఉపాయాలు..

కోతులను తరిమేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మంకీగన్, టపాసులు పేల్చడం, లేజర్ లైట్ వేయడం వంటి ఉపాయాలు కూడా కోతులను తరమడంలో నిష్ప్రయోజనంగా మారుతున్నాయి. ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావాలన్నా, తిరిగి ఇళ్లకు చేరుకోవాలన్నా కోతుల బెడద తప్పడం లేదు. కొద్ది రోజుల క్రితం పాతబాన్సువాడలో ఇద్దరు వ్యక్తులపై కోతులు దాడి చేయడంతో గాయాల బారినపడ్డారు.



బాన్సువాడ పట్టణంలో కోతుల సంచారం ఇలా

నియంత్రణ చర్యలు కరువు

బాన్సువాడ పట్టణంలో కోతుల నియంత్రణలో అధికారులు విఫలమయ్యారనే చెప్పవచ్చు. కోతులే కదా అని చాలా తేలికగా తీసుకుంటున్నారు. కానీ వాటి నియంత్రణ కోసం కనీస చర్యలు కూడా తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయంలో జీకే పరీక్ష



జీకే పోటీలు రాస్తున్న విద్యార్థులు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): 58వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని పాఠశాల స్థాయి విద్యార్థులకు ఆదివారం జీకే పరీక్షలను నిర్వహించారు. కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలో నిర్వహించిన జీకే పరీక్షకు వివిధ పాఠశాలకు చెందిన 55 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ తారకం, సంపత్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందూరు వాసులకు అవార్డులు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శివమ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన నాట్యమయూరి నృత్య కళాప్రదర్శనలో జిల్లాకు చెందిన చిన్నారులు అద్భుత ప్రదర్శనతో మెప్పించారు. ఉత్తమ ప్రదర్శన చేసిన వారికి ఎంపీ కృష్ణయ్య బహుమతులు అందించారు. సాన్వి, శ్రేష్ఠ, విద్మహి, మితన్వి, ఆద్యశ్రీ, లక్ష్మిసారిక అద్భుత ప్రదర్శన ఇచ్చారు.



వాకింగ్ చేస్తున్న బీసీ సంఘం నాయకులు

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రన్ ఫర్ సోషల్ జస్టిస్

సుభాష్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రన్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో బీసి సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం ఉదయం నడక నిర్వహించారు. ఈ సందర్భంగా బీసి సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ బీసీల ఉద్యమాన్ని ఆపడం ఎవరితరం కాదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్‌లు అమలుపర్చాల్సిందేనన్నారు. 9శాతం కూడా లేని అగ్రవర్ణాలకు ఈడబ్ల్యుఎస్ పేరుతో 10శాతం రిజర్వేషన్‌లు కల్పించిన కేంద్ర ప్రభుత్వం 56శాతం ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు అమలు చేసేందుకు ఎందుకు వెనకడుగు వేస్తుందని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్స ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాకిషన్, కరిపె రవీందర్, కోయాడ శంకర్, చంద్రకాంత్, చంద్రమోహన్, తోట రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కవికి పెందోట పురస్కారం

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి సాహిత్య పరిషత్ సిద్ధిపేట వారు ప్రతీ సంవత్సరం అందించే రాష్ట్రస్థాయి పురస్కారాన్ని జిల్లాకు చెందిన కవి చింతల శ్రీనివాస్ గుప్త అందుకున్నారు. ఆదివారం సిద్ధిపేటలో జరిగిన సభలో నిర్వాహకులు వెంకటేశ్వర్లు ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన బాల సాహిత్య వేదిక అధ్యక్షుడు కాసర్ల నరేష్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, శారద, గంట్యాల ప్రసాద్, నారాయణలు హర్షం వ్యక్తం చేశారు.

సూర్య భగవానుడు ప్రత్యక్ష దైవం

● ప్రేమ్ నారాయణ మహరాజ్

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భూమండలానికి తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలుగానే.. సూర్యభగవానుడు ప్రత్యక్ష దైవం అని, ఆనాడు రాముడు ఆదిత్య హృదయాన్ని జపించి రావణాసురుడిని సంహరించాడని ప్రేమ్ నారాయణ మహరాజ్ ప్రవచనం చేశారు. జిల్లా కేంద్రంలోని ఉమామహేశ్వర కమ్యూనిటీ హాల్‌లో మూడవ రోజైన ఆదివారం రామకథ ప్రవచనంలో భాగంగా ఆయన భక్తులనుద్దేశించి ప్రవచనం చేస్తూ అగస్త్య మహరుషి శ్రీరాముడికి ఆదిత్య హృదయాన్ని ఉపదేశించడంతో రాముడు వెంటనే అత్యంత తేజోవంతమైన ఆయురారోగ్యాలను తెలియక చేసిన పాపాలను తొలగించడంతో పాటు అన్నింటా విజయాన్ని చేకూర్చే ఆదిత్య హృదయాన్ని స్తోత్రం చేసి యుద్ధానికి బయలుదేరాడు. రాముడు రావణాసురుడితో భీకరమైన యుద్ధం చేశాడు. రావణాసురుడికి యుద్ధంలో అనేకమైన అపశకునాలు కనబడటంతో శకుని శాస్త్రం తెలిసిన రాముడు తనకు విజయం వరించబోతుందని భావించాడని అన్నారు. ఇరుపక్షాల సైనికులు తమ తమ ఆయుధాలతో సిద్ధంగా నిలిచిన రామ రావణుడి మధ్య యుద్ధాన్ని ఆద్యాంతం రసవత్తరంగా సాగింది. రామ రావణాసుడి మధ్య వేలాది బాణాలు ఒకరిపై ఒకరు ప్రయోగించుకుంటూ యుద్ధం చేశారని అన్నారు. దేవతలు ఇంద్రాది అష్ట దిక్పాలకుడు రామ రావణ యుద్ధం మరొకటి పోలిక లేదని అభివర్ణించారని అన్నారు. రాముడు వేసిన ఒక బాణంతో రావణాసురుడి పతాకం కూలి కిందపడిపోవడంతో రావణాసుడు తనకు ఓటమి తప్పదని అనుకుంటుండగానే రాముడు మరొక బాణంతో వక్షస్థలంపై ప్రయోగించాడు. నేలకొరిగిపోయాడని అన్నారు. అగస్త్య మహరుషి రాముడుకి ఇచ్చిన బ్రహ్మాస్త్రంతో రావణాసుడు మరణించడంతో దేవతలు, ప్రజలంతా ఆనందంతో పొంగిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏక్తా సమితి ప్రతినిధులు రాంస్వరూప్ దాలియా, వల్లబ్ సర్దార్‌జి, అనిల్ కదం, దినేష్ ఠాకూర్, పవన్ కుమార్, దినేష్ తోమర్, ద్రాత్రిక రమేష్, రాంప్రసాద్ చటర్జి, అనిల్ గ్రైమా, విజయ్ వ్యాస్, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ కల్చరల్: నగరంలోని బ్రహ్మపురిలోగల పెద్దరాంమందిర్‌లో అయోధ్య నుంచి వచ్చిన ప్రముఖ ప్రవచకుడు ప్రేమ్ నారాయణ మహరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని కలియ తిరిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాందాస్ గొప్పతనాన్ని కీర్తించి భక్తులకు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద రాంమందిర్, మఠం అధ్యక్షుడు, శ్రీనివాసచార్య, మధుసూదనచార్య, అర్చకులు ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.




ప్రవచనం చేస్తున్న ప్రేమ్ నారాయణ మహరాజ్



పెద్ద రాంమందిర్‌లో భక్తులతో..

భూ.. మాయ!

(5వ పేజీ తరువాయి...)


Rs. 100 ONE HUNDRED RUPEES
INDIA NON JUDICIAL
IRREVOCABLE GENERAL POWER OF ATTORNEY

2024లో నిజామాబాద్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అసైన్డ్ భూమికి రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్స్

మొత్తంలో డబ్బులు ముట్టినట్లు తెలుస్తుంది. నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ లు చేసి ఇప్పుడు ఇతర ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రా ర్, జూనియర్ అసిస్టెంట్‌లు ఇప్పుడు తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. ఇలా నగరంలో అనేక ప్రాంతాల్లో నకిలీ పత్రాలతో పాటు ఇంటి నెంబర్‌ల ఆధారంగా రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు. ప్రభుత్వ భూమిలో కబ్జాలో ఉన్న వారికి ఆక్యూపయర్ సర్టిఫికెట్ల పేరుతో అక్రమ రిజిస్ట్రేషన్‌ల దందా నిజామాబాద్ అర్బన్‌తో పాటు రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జోరుగా సాగుతోంది. జిల్లావ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ శిఖం భూములు, ఆబాది భూములకు నకిలీ సర్టిఫికెట్లు సృష్టిస్తు రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మధ్యవర్తులు, డాక్యుమెంట్ రైటర్‌లదే హవా

జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అనుబంధంగా డాక్యుమెం ట్ రైటర్‌ల దుకాణాలు ఉన్నాయి. డాక్యుమెంట్ రైటర్‌లే కాకుండా మధ్యవర్తులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తిష్టవేసి తమకు అనుకూలమైన డాక్యుమెంట్‌లకు రిజిస్ట్రేషన్‌లు చేయించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా వెళ్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు చేసుకునే పరిస్థితి సామాన్యుడికి లేదు. కచ్చితంగా మధ్యవర్తుల ద్వారానో లేదా డాక్యుమెంట్ రైటర్‌ల ద్వారానో రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాల్సిందే. సబ్‌రిజిస్ట్రార్‌తో ముందుగానే ఓ ఒప్పందం చేసుకుని ప్రతీరోజు ఒక్కో డాక్యుమెంట్‌కు ఒక్కో రేటు చొప్పున నిర్ణయించుకుని కోడ్ భాషలో రిజిస్ట్రేషన్‌లు చేస్తున్న వైనం జిల్లాలో జరుగుతుంది. అంతేకాకుండా భూముల రేట్లు అధికంగా ఉన్న నిజామాబాద్ అర్బన్, రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ వ్యవహారం ఎక్కువగా జరుగుతుంది. ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి సబ్‌రిజిస్ట్రార్‌లు పట్టుబడినప్పటికీ.. ఆ కుర్చీలో ఎవరు కూర్చున్న అందినకాడికి దండుకునే వ్యవహారం మాత్రం ఆగడంలేదు.

ఉత్తర్వులు అందినా.. ఉత్తిదేనా?!

(5వ పేజీ తరువాయి...)

ముఖ్యస్థానంలో ఉన్న నేతకు, వీసికి మధ్య గ్యాప్ వచ్చినట్లు ప్రచారం జరుగుతుంది. తెలంగాణ యూనివర్సిటి ప్రాంగణంలోనే వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని సదరు నేత ప్రయత్నలు చేయగా వీసి స్థలం విషయంలో స్పష్టత ఇవ్వనట్లు తెలుస్తుంది. ఈ విద్యాసంవత్సరం నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయ తరగతులు ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తుండగా స్థల ఎంపిక పూర్తయితే త్వరగా నిధులు తీసుకువచ్చి నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు సదరు నేత చేస్తున్న ప్రయత్నాలు వీసి మౌనధోరణి ఆగ్రహం తెప్పిస్తున్నట్లు తెలుస్తుంది. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన సదరు నేతకు విద్యార్థి సంఘాలు అక్రమ నియామకాల విషయం విన్నవించగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతుంది.

వ్యవసాయ వ్యర్థాల కాల్చివేతతో.. భూసారానికి ముప్పు

(5వ పేజీ తరువాయి...)

భూమిలో ఉండే పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు, క్రిమి కీటకాలు నశించిపోవడమే కాకుండా సహజసిద్ధమైన నేల తన స్వభావాన్ని కోల్పోతుంది. దీని వల్ల భూమి సారవంతం తగ్గిపోయి పంట దిగుబడి తగ్గి రైతులకు నష్టం వాటిల్లే ఆస్కారం ఉంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా వరి కొయ్యలను భూమిలో కలియదున్నడం వల్ల కుల్లిపోయిన వరికొయ్యలు, వ్యవసాయ వ్యర్థాలు ఎరువుగా మారి భూసారం పెరిగి ఎక్కువ పంట దిగుబడి సాధించేందుకు వీలుంటుంది.

భూమి సారవంతం మన చేతుల్లోనే..

భూమిసారవంతం చేసే పద్ధతులు రైతుల ఆలోచనలతోనే ముడిపడి ఉన్నాయి. పొలం కోసిన తర్వాత పంట వ్యర్థాలను తగులబెట్ట కుండా కొద్దిగా నీటి తడులు ఇచ్చి సింగిల్ సూపర్ పాస్పెట్ చల్లుకుని ట్రాక్టర్ కేజీవీల్స్‌తో దమ్ము చేస్తే ఆ పంట వ్యర్థాలు భూమిలో కలిసిపోతాయి. ఇలా చేసి కొన్ని రోజులు భూమి ఆరబెట్టిన తర్వాత పంట సాగుకు భూమిని సిద్ధం చేసుకుంటే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ విధానం పాటించడం వల్ల వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడమే కాకుండా భూమికి సారాన్ని అందించిన వారమవుతాము.

వరి కొయ్యలు కాల్చివేస్తే రైతులకు నష్టమే..

: చిన్నారెడ్డి, రైతు, మగ్గిడి



వరి పంటలు కోతలు పూర్తయ్యాక వరి కొయ్యలను కాల్చివేయడం వల్ల రైతులకు నష్టమే వాటిల్లుతుంది. పర్యావరణం రోజురోజుకు దెబ్బతింటుంది. దీంతో కాలుష్యం పెరిగిపోతుంది. భూమిలోని సూక్ష్మజీవులు, క్రిమి కీటకాలు నశించి భూసారం తగ్గుతుంది. పొలాల్లోనే వరికొయ్యలు వ్యవసాయ వ్యర్థాలను కలియ దున్నడం ద్వారా భూమి సారవంతం కావడమే కాకుండా ఫర్టిలేజర్ ఖర్చులు తగ్గి రైతులకు ఎంతో కొంత డబ్బులు ఆదా అవుతాయి.

వరి కొయ్యాలను పొలాల్లోనే కలియ దున్నాలి

: హరికృష్ణ, మండల వ్యవసాయాధికారి



వరి పంటను కోసిన తర్వాత వరి కొయ్యలను పొలాల్లో కలియ దున్నాలని దీని వల్ల భూసారం పెరుగుతుంది. వరి కొయ్యలను కాల్చివేయడం వల్ల జరిగే నష్టాలను రైతులకు వివరిస్తున్నాం. వ్యవసాయ వ్యర్థాలు కల్చితే మిత్ర పురుగులు, శత్రు పురుగులు నశిస్తాయి. దీనివల్ల భూసారం తగ్గిపోయి పంట దిగుబడులు తగ్గుతాయి. అంతేకాకుండా సేంద్రీయ కార్బణం తగ్గిపోతుంది. వరి కొయ్యలను కాల్చడం వల్ల కొన్ని కిలో మీటర్ల మేర కాలుష్యం ఏర్పడడంతో పాటు పర్యావరణానికి కీడు చేస్తుంది.



వరి పంట వేయడానికి భూమిని సిద్ధం చేస్తున్న దృశ్యం

19న ఉచిత గుండె వైద్య శిబిరం : రాజశ్రీ

సుభాష్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం, అపోలో ఆసుపత్రి హైదరాబాద్ ఆధ్వర్యంలో నవజాత శిశువు నుంచి 18 ఏళ్ల వయసు కలిగిన పిల్లలకు గుండె వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం ఈనెల 19 బుధవారం జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని రూం నెం.జి-31లో నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదికారి రాజశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని కింది అంతస్తు ఐసిటిసి రూమ్ ఎదురుగా ఉన్న జి-31 రూమ్‌లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కొత్త రేషన్‌కార్డు, ఆహార భద్రతకార్డు, ఆధార్ కార్డులు, పిల్లల జనన ధ్రువపత్రాలు, ఆదాయ ధృవీకరణ పత్రాలు గతంలో ఉన్నటువంటి ఆరోగ్య రికార్డులు తీసుకుని రావాలని ఆమె తెలిపారు.

వృథాగా చేతి పంపులు

● పట్టించుకోని అధికారులు

మోపాల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు అప్పుడు పాలకులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు చేతిపంపులను వేయించిన విషయం అందరికి తెలిసిందే. ఈ చేతిపంపుల నుంచే అనేక మంది తాగునీటిని తెచ్చుకునే వారు ఇప్పుడు మిషన్ భగీరథ నీరు రావడంతో అప్పటి చేతిపంపులు ముళ్లకంపలో పడి ఉన్నాయి. నిజామాబాద్ నగరానికి కూతవేటు దూరంలో ఉన్న మోపాల్ మండలంలోని ముదక్‌పల్లి ప్రధాన రోడ్డుపై ఉంది. ఈ దారి గుండానే అనేక మంది ప్రజాప్రతినిధులు, అధికారులు వస్తూ పోతుంటారు. ఒకప్పుడు ఈ చేతిపంపుల నుంచే తాగునీటిని తెచ్చుకునే వారమని గ్రామస్తులు వివరించారు. మిషన్ భగీరథ నీరు ఇంటింటికి సరఫరా కావడంతో అప్పటి చేతిపంపులను ఇప్పుడు వాడేవారే కరువయ్యారు.



మోపాల్ - ముదక్‌పల్లిలో ముళ్లకంపలో ఉన్న చేతిపంపు

మంచిప్ప పొలాల్లోకి మురికి నీరు

మోపాల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో ఉన్న మురికినీరు అంతా పొలాల్లోకి ప్రవహించడంతో వేసిన వరిపంట నష్టపోవాల్సి వస్తుందని మంచిప్ప గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మంచిప్ప చెరువు కింద ఉన్న పొలాల్లోకి ఊరు మురికి నీరు అంతా ప్రవహించడంతో వేసిన పొలాలన్నీ నష్టపోవాల్సి వస్తుందని వారు వివరించారు. గత నాలుగు సంవత్సరాల నుంచి రైతులకు చేతికొచ్చిన పంట అంతా మురికి నీరుతో బురదమయం అవుతుందని వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ మురికి నీటి ప్రవాహానికి డ్రైనేజీలు లేకపోవడంతో పొలాల్లోకి ప్రవేశిస్తుందన్నారు. స్థానికంగా ఉన్న అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకునేవారు కరువయ్యారని వారు మండిపడుతున్నారు. అప్పు సప్పు చేసి పంటలను వేసుకుంటే నోటికాడికి వచ్చిన పొలం అంతా మురికి నీరు ప్రవహించడంతో నష్టపోవాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. మురికి నీరు అంతా పొలాల్లోకి రావడంతో కోత మిషన్ యజమానులు పొలాలను కోయడానికి వెనుకంజ వేస్తున్నారని అన్నారు. ఈ గ్రామ రైతులు ఎదుర్కొంటున్న సమస్యను వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ప్రవహిస్తున్న మురికి నీటికి డ్రైనేజీలను తక్షణమే నిర్మించాలని కోరుతున్నారు.



మోపాల్ - పొలంలోకి వస్తున్న మురికి నీరు

సీపీఐ ప్రజాసమస్యలపై పోరాడుతోంది

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ



పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ

కామారెడ్డి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ప్రజల సమస్యల పై పోరాడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో శనివారం సీపీఐ వందేళ్ల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వందేళ్లు పూర్తి చేసుకున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీని దేశంలో ఇప్పటి వరకు కూడా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమం పోరాటాలు సాయుధ పోరాటాలు నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని అన్నారు. అలాగే డిసెంబర్ 26న జరిగే వందేళ్ల మహాసభను విజయవంతం చేయడానికి సీపీఐ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దశరత్, సహాయక కార్యదర్శి రాములు, రాజిరెడ్డి, దేవయ్య, శ్రీనివాస్, మల్లేష్, రాజమణి, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నూతన కమిటీ ఎన్నిక

కామారెడ్డి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణ పీడీఎస్‌యూ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆదివారం జిల్లా అధ్యక్షుడు సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పీడీఎస్‌యూ పట్టణ నూతన అధ్యక్షునిగా రాకేష్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్, ఉపాధ్యక్షునిగా నితిన్, సహాయ కార్యదర్శిగా అనిల్, కోశాధికారిగా శ్రీకాంత్, కమిటీ సభ్యులుగా శ్రీనివాస్, సతీష్, దశరథ్, అనిల్, శ్రీకాంత్‌లను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

వేడుకల్లో నాయకుల బిజీ

మహమ్మద్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలకేంద్రానికి చెందిన చింతకింది కృష్ణ కుమార్తె వివాహం ఆదివారం మహమ్మద్‌నగర్ మండలకేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివాహానికి మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, మాజీ జడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. బిచ్కుంద మాజీ ఏఎంసీ చైర్మన్ నాల్చర్ రాజు, నాయకులున్నారు.

మొక్కజొన్నకు మద్దతు ధర పొందండి

సదాశివనగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధర పొందాలంటే రైతులు తప్పకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని అధికారు లు సూచిస్తున్నారు. ప్రభుత్వ మద్ధతు ధర రూ.2400 ప్రకటించడంతో మండలంలోని సదాశివనగర్, పద్మాజీవాడి, ఉత్తునూర్ సహకార సంఘాలకు కొనుగోలు కేంద్రాలను ప్రకటించారు. రైతులు పండించిన మొక్కజొన్నల ను సహకార సంఘాలు నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో 14శాతం తేమ వచ్చేంతవరకు ఆరబెట్టుకోని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుంటే రైతులకు లాభసాటిగా ఉంటుంది. గ్రామాలలో ని దళారులకు రూ.1800లకు రైతులు అమ్ముకుని నష్టపోకుండా కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని అయ్యప్ప ఆలయం సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప ఆలయం వద్ద ప్రధాన రోడ్డు చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారిందన్నారు.

ఉగ్రవాయి మైసమ్మ ఆలయంలో పూజలు

కామారెడ్డి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామశివారులో గల ఉగ్రవాయి మైసమ్మ ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు కృష్ణామ చార్యులు తెలిపారు. ఆదివారం పర్వదినం కావడంతో ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు అమ్మ వారికి కుంకుమ పూజలు, ఓడి బియ్యం, హారతి, అర్చన వంటి పూజలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో గల నాగదేవత తదితర దేవతమూర్తులను దర్శించుకొని మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సినిమా గైడ్

దేవి	: కాంత (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్	: ది గర్ల్‌ఫ్రెండ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: దేదే ప్యార్‌దే-2 (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్	: మాస్‌జాతర (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1	: కాంత (10.30, 1.30, 4.40, 7.40, 10.30)
స్క్రీన్-2	: ది గర్ల్‌ఫ్రెండ్ (11.00, 1.40, 7.30)
	: దేదే ప్యార్‌దే- (హింది) (4.30, 10.30)
స్క్రీన్-3	: శివ(రీరిలీజ్) (11.00, 1.40, 4.40, 7.30)
	: ది గర్ల్‌ఫ్రెండ్ (10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1	: దేదే ప్యార్‌దే- (హింది) (10.00)
	: కాంత (1.05, 7.20, 10.40), ది గర్ల్‌ఫ్రెండ్ (4.25)
స్క్రీన్-2	: కాంత (10.10)
	: దేదే ప్యార్‌దే- (హింది) (1.30, 7.50, 10.55)
	: సంతానప్రాప్తిరస్తు (4.35)
స్క్రీన్-3	: శివ (రీరిలీజ్) (10.00), లవ్ ఓటిపి (1.05)
	: కాంత (4.20), ది గర్ల్‌ఫ్రెండ్ (7.40, 10.35)
స్క్రీన్-4	: సి మంతం (12.35), గోపిగాళ్ల గోవా ట్రిప్ (3.00)
	: సీతా ప్రయాణం కృష్ణతో (5.20)
	: ది గ్రేట్ ప్రీవెడ్డింగ్ షో (8.10)
	: శివ (రీరిలీజ్) (10.40)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,26,700	రూ.1,17,200	రూ.1650

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.250	రూ. 270
వెన్‌కాబ్(కిలో)	: రూ.150	రూ.260	రూ. 280



రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలి

నిజామాబాద్ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని, వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని జిల్లా కన్వీనర్ దీపిక అన్నారు. ఆదివారం నగరంలోని నాందేవ్‌వాడలోని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్ పోస్టర్‌లను విడుదలచేశారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను రక్షించే చట్టాలు కఠినంగా అమలుచేయాలని కోరారు. షీటీం వ్యవస్థను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల చట్టాలు, హక్కులపై తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 26, 27,28 తేదీల్లో నిజామాబాద్‌లో జరగబోయే రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్‌కు రాష్ట్రవ్యాప్తంగా హాజరయ్యే ఈ కన్వెన్షన్‌ను జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో యువతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మేఘన, బాలమణి,సంజన తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు